# ముగింపు

పది వరసల చంద్రహారం తళతళ మెరుస్తోంది మెడలో. చెవులకున్న వజ్రాల దుద్దులు ధగధగ లాడిపోతున్నాయి. ఎయిర్ కండిషన్డ్ కారులోంచి దిగి లోపలికొస్తుంటే ఎర్రటి పాదాలు కందిపోతాయేమోనని భయమేస్తుంది చూసేవాళ్ళకి.

కారు రోడ్డు పక్కగా పెట్టి, ముందు గదిలోకి శాంతిశ్రీ రాగానే, "రండి, రండి" కంగారుగా లేచి నిలబడింది సుభద్ర.

"అబ్బాయి చెప్పాడు.... గది ప్రత్యేకంగా కావాలని" ఏదో అనబోయింది వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న సుభద్ర.

"అన్నీ చెప్పాడు కదా... ఆ... నాకు వీక్లీ వచ్చే పత్రికలన్నీ కావాలి.... నేనే డబ్బు కట్టుకుంటాను. ఊ... ఇంకా ఏం చెప్పాడు?" సుభద్ర ముఖంలోకి చూస్తూ అంది శాంతిశ్రీ.

"ఇంకేం లేదు... మీరెప్పుడు చేరతారు?"

"ఎప్పుడైనా చేరచ్చు. ఇప్పుడు కూడా చేరచ్చు- ఏమంటారూ" శాంతిశ్రీ నవ్వుతుంటే ముఖం మరీ అందంగా వుంది. పది నిమిషాలు కూర్చుని వెళ్ళిపోయింది శాంతిశ్రీ.

రాత్రి భోజనాలు అయిపోయాయి. శాంతిశ్రీ గదిలోకెళ్ళింది.... ఈ గది తనదే, గదేమిటి ఈ ఇల్లేతనది. ఈ ఇంట్లో ప్రతి వస్తువు తనదే. కానీ.... శాంతశ్రీ కంటిలో చిన్న నీటిపొర అలా కదిలి ఇలా మాయమయింది క్షణంలో!

కర్టెన్ అటు ఇటు కదులుతూంటే, "రా, లోపలికి" అంది గుమ్మంవైపు చూస్తూ.

"నేను నానమ్మా'- తియ్యని గొంతు. ఒళ్ళు పులకరించింది.

"నువ్వా, నా కన్నతండ్రి రా, రా" మంచం మీద నుంచి గబుక్కున లేచి ఎత్తుకుంది వంశీని, ఆరేళ్ళ తన మనమడిని!

"నిద్ర రావడం లేదా?"

"ప్చ్...నానమ్మా....నువ్వు నిజంగా వెళ్లిపోతున్నావా!"

ఉలిక్కిపడింది శాంతిశ్రీ. "ఎక్కడికీ"

ఆ పసివాడు నానమ్మ ముఖంలోకి చూస్తూ "నేనూ వస్తా" అన్నాడు. నానమ్మ ఒళ్ళో పడుకుంటూ.

"నేను ఎక్కడికి వెళ్ళను" మనుమణ్ణి దగ్గరకు తీసుకుంది.

వంశీ ఎక్కడికీ వెళ్ళను" మనుమణ్ణి దగ్గరకు తీసుకుంది.

వంశీ ఒక్క క్షణంలో మంచం మీద నుంచి దూకి పరుగెత్తాడు.

"నువ్వన్నీ అబద్ధాలు చెప్తావు మమ్మీ"

"ఏమిటీ" సరిత అటూ ఇటూ చూస్తూ అంది. "అవునూ, నానమ్మ ఎక్కడికీ వెళ్ళదంట" అన్నాడు వెంటనే.

"వింటున్నారా"

"అంటే" రెట్టించింది సరిత.

"అంతే" కిరణ్ ముఖం పేపరులోనే.

ఆ సంభాషణ అక్కడితో ఆగిపోయింది. పసివాడు నిద్రపోయాడు. ఇంచుమించుగా ఇలాంటి సంభాషణలు ఆ ఇంట్లో ఏడాదిగా సాగుతున్నాయి.

శాంతిశ్రీ గదిలో గిరగిరా తిరుగుతున్న ఫాన్ వంక చూస్తోంది.... గతం పొరలు పొరలుగా కళ్ళముందు నుచి కదిలిపోతోంది. ఇరవైయేళ్ళకే పెళ్లి కావడం, రెండేళ్లు తిరక్కుండానే భర్త యాక్సిడెంటులో మరణించడం, అనాథాశ్రమం నుంచి పిల్లవాణ్ణి తెచ్చి పెంచుకోవటం, కష్టపడి ఉద్యోగం చేస్తూ రూపాయి రూపాయి కూడబెట్టి ఇల్లు, బంగారం, కారు- ఒకటేమిటి, అన్నీ అమర్చుకోవడం! ఇరవైయేళ్ళనుంచి గడచిన నలభైయేళ్ళ జీవితం ఎంతో ఆదర్శవంతంగా, ఆనందంగా సాగిపోతే, పోతే -ఇప్పుడేమిటిది! ఏ నాగరికతకి రూపమిది! ఏ సంస్కృతికి ప్రతీక ఇది! శాంతిశ్రీ కదులుతున్న ఫాన్ వంకే చూస్తోంది, తనెవరికి బరువు? ఎందుకు బరువు? -శాంతిశ్రీకి నవ్వు ఆగలేదు. రిటైరయ్యాక కూడా ఎంతో ఉత్సాహంగా, ఆరోగ్యంగా వున్న తను ఎవరికి సమస్య! 'ఇప్పుడు బాగానే వుంటుంది - ఈ కార్లలో తిరగడాలు, ఆ కబుర్లు, నవ్వులు-నాల్రోజులు పోయాక ఏ చెయ్యో, కాలో పడిపోతే ఎవడు చేస్తాడు-' ఒకరోజు సరిత అరిచిన అరుపు గుండెల్లో మారుమోగింది ఒక్కసారిగా శాంతిశ్రీకి ఈ రోజు మళ్ళీ!

ఇది నిజమేనా, ఎవరూ చేయరా- ఏమో! శాంతిశ్రీ లేచికూచుంది. గబగబా మంచినీళ్ళు తాగింది.

ఒక్కసారి శాంతిశ్రీ బాల్యం, తన తల్లి, తండ్రి మావయ్యలు, పెద్దనాన్న, అమ్మమ్మ- అందరూ కళ్లముందు కదిలారు.

నాలుగేళ్ళు లేవకుండా మంచంలో పడున్న నాయనమ్మకి తన తల్లి ఎంత సేవ చేసిందో తనకు తెలుసు. తాతగారి చాధస్తాలని, మొండితనాన్ని నాన్న ఎలా భరించాలో తనకి తెలుసు.

'పెద్దవాళ్ళు అలాగే వుంటారు- అది మరో బాల్యం' అని అన్నిటికీ నవ్వేస్తూ, అందరిమధ్య హాయిగా బతికేసిన మన్ననలందిన ఆ అమ్మ ఏదీ!!! స్వర్గంలో వుందా-ఏమో!

ఒకనాటి సంఘటన శాంతిశ్రీ మనసులో మెదిలింది. కాలేజినుంచి స్కూటర్‌పై వస్తూ ఓ ఇంటిముందు సడన్‌గా ఆపింది స్కూటర్, కూరల బుట్టబరువు మోయలేక మోస్తూ, మేడ మెట్లెక్కుతున్న తాతగారు దగ్గర కెళ్ళింది. ఇటివ్వండి' ఆ బుట్ట లాక్కుంది. గబగబా మెట్లెక్కి కూరల బుట్ట ఆ ఇంట్లో పెట్టి కిందికి దిగింది. తాతగారు ఆశ్చర్యంతో, ఆనందంతో ఉక్కిరిబిక్కిరయి 'నీలాంటి పిల్లలు ఇంకా అక్కడక్కడ వుండబట్టే దేశం ఈపాటి బాగుంది' అన్నాడు శాంతిశ్రీ తల నిమురుతూ. తాతగారు మెట్లెక్కి ఇల్లు చేరేవరకు కింద నిలబడి స్కూటర్ స్టార్ట్ చేసింది శాంతిశ్రీ.

'డబ్బు ఒక్కటే చాలదు మనిషి బతకడానికి...దానికి మించిన ఆదరణ, ఆప్యాయత, దయ...ఇలాంటివెన్నో వుండాలి' శాంతిశ్రీ తండ్రి శాంతిశ్రీకి ఏదో వంకని ఇలాంటి మాటలే చెప్పేవాడు.

శాంతిశ్రీ దీర్ఘంగా నిట్టూర్చింది. గడియారం మూడు గంటలు కొట్టింది. లేచి కిటికీ దగ్గర నిలబడింది. ఆ కిటికీ తనకెంతో ఇష్టం. ఈ కిటికీ దగ్గర నిలబడి, రోడ్డున వెళ్ళే రిక్షాలను, ఆటోలను, కార్లను, ఎడ్లబండ్లను చూపిస్తూ కబుర్లు చెప్తూ వంశీని ఎత్తుకు అన్నం తినిపించింది ఎన్నో ఏళ్ళు!!!

"అమ్మా, నిద్రపోలేదా"- కిరణ్ చేతిలో వున్న సిగరెట్ పక్కన విసరేసి తల్లి గదిలోకొచ్చాడు. ఏదో చెప్పాలని గుండె గొంతులో కొట్లాడుతోంది.

"అమ్మా...అది ఏదో అంటుంటుందిలే. ఆ....వంశీ నువ్వు లేకపోతే బెంగపడతాడు....నేనుకూడా" నసిగాడు కిరణ్. గొంతు తడారి దగ్గొచ్చింది.

"ఊ" శాంతిశ్రీ మంచినీళ్ళు తాగింది.

'నేను ఎందుకుండద్దూ' ఆ మాట అందామని పెదిమలు కదిలాయి. కానీ మాట పైకి రాలేదు. కిరణ్ కొంచెం సేపు కూచుని వెళ్ళిపోయాడు. శాంతిశ్రీ కిటికీలోంకి చూస్తోంది.

తెల్లవారింది. రోడ్డంతా సందడి!

కర్ర పట్టుకు నడుస్తున్న ముసలాడిని చెయ్యి పట్టుకు రోడ్డు దాటిస్తోంది పదేళ్ళ పిల్ల! శాంతిశ్రీ అటే చూస్తోంది.

గబుక్కున తలుపు తోసుకు రోడ్డుమీద కెళ్ళింది. ఆ పిల్ల చేయి పట్టుకుని ఆ తాతని తనతో తీసుకొచ్చింది శాంతిశ్రీ. విస్తుపోయింది పిల్ల. ఏమీ అర్థం కాక, తనేం తప్పుచేశాడో తెలియక తికమకపడ్డాడు తాత.

"ఎందుకు రోడ్డు దాటుతున్నావ్" శాంతిశ్రీ ఆప్యాయంగా అంది. తెల్లని మీసాల్లోంచి అంతకన్నా తెల్లవైన చిరునవ్వు విరిసింది ముఖంలో.

"బీడి కొనుక్కుంటాడట. అక్కడ కొట్లో బాగుంటాయట- మా నాన్న అన్నాడు, తాతయ్య ఒక్కడే వెళ్లకూడదు, నువ్వు తోడుగా వెళ్ళమని అందుకు నేనొచ్చా" పదేళ్ళ పిల్ల చకచకా చెప్తుంటే నవ్వొచ్చింది శాంతిశ్రీకి.

"నన్ను కూడా తీసుకెడతావా, మీ తాతని తీసుకెళ్లినట్టు!" శాంతిశ్రీ ఆ పిల్ల కళ్ళల్లోకి చూస్తోంది.

"ఛా, అదేంటి ఆంటీ, మీకు కారుందిగా" అంది పోర్టికోలో వున్న కారువంక చూస్తూ.

"చూస్తున్నారా ఆ ముసలాడితో కబుర్లు-వాడికి ఓ ఔట్‌హౌస్ వేసేస్తుందేమో." కిరణ్ అంతకు ముందునుంచీ చూస్తూనే వున్నాడు.

"వేసెయ్యనీ.....ఎవరో ఒకళ్ళు"- సరిత ముఖం కోపంతో కందిపోయింది.

ఆ రోజు తర్వాత ఆ ముసలాడు, పిల్ల తరచు వస్తూనే వున్నారు.

మూణ్ణెళ్లు గడిచాయి. ఇంటివెనుక చిన్న ఆవుట్‌హౌస్ వచ్చింది. పదేళ్ళ పిల్ల, దాని తమ్ముడు, దాని తాత, అమ్మ, నాన్న అందరితో సందడిగా వుంది. శాంతిశ్రీ మనసు ప్రశాంతంగా వుంది.

సరితకి ఏం జరుగుతోందో తెలియడం లేదు. ఏమన్నా జరగనీ అని నిర్లిప్తంగా వుంది కిరణ్‌కి. నానమ్మ ఎక్కడికీ వెళ్ళదు అనే ధైర్యం వచ్చేసింది వంశీకి.

ఎయిర్ కండిషన్డ్ కారు గుమ్మంలో ఆగగానే గుమ్మంవైపు తలెత్తి చూసింది సుభద్ర.

పది వరుసల చంద్రహారం తళతళ మెడలో మెరుస్తుంటే, చెవులకున్న వజ్రాల దుద్దులు ధగధగలాడుతుంటే, లోపలకొచ్చిన శాంతిశ్రీ కుర్చీ జరుపుకుని బల్లముందు కూర్చుంది.

"క్షమించండి, మిమ్మల్ని కొంచెం శ్రమ పెట్టాను. ప్రత్యేకంగా రూము కావాలని కూడా అడిగా కదా..."

"ప్రత్యేకంగా గది కేటాయించాను.. ఎన్ని గంటలకొస్తారు" సుభద్ర శాంతిశ్రీ ముఖంలోకి చూసింది.

"రాను"

"అంటే, మరేదైనా ఆశ్రమం చూశారా" శాంతిశ్రీ వైపు చూస్తూ అంది సుభద్ర.

"ఆ..."

"చూశారా-ఎక్కడ?"

శాంతిశ్రీ నవ్వింది "నా మనసే ఆశ్రమం. అందులోనే వుంటాను. ఏం, ఉండలేవనంటారా"

సుభద్ర ఆ మాటలకు ఏం చెప్పాలో తెలియక మౌనంగా ఊరుకుంది. ఆరునెలలు తిరిగాయి... శాంతిశ్రీ కారు అమ్మేసింది. పదివరసల చంద్రహారం మెడలో కనిపించలేదు సరిత ఓరోజు చూసేసరికి.

"చూశారా, చంద్రహారం కూడా అమ్మేసింది. మీరేం పట్టించుకోరేం" సరిత భర్త ముఖంలోకి చూస్తూ.

"నీకనవసరం కదా" కిరణ్ గొంతులో గాంభీర్యం నిండుకుంది. సరిత ముఖం వెలవెలబోయింది.

ఆ రాత్రి శాంతిశ్రీ నిద్రపట్టలేదు. తెల్లవారురఝామున నాలుగు గంటలయింది. కిరణ్ తల్లి గదిలోకొచ్చాడు. "వెళ్ళిపోవచ్చు కానీ.. వంశీని చూడకుండా వుండలేను కదా- అదీ" అంది చిరునవ్వు నవ్వుతూనే శాంతిశ్రీ.

పదిహేనురోజులు గడిచాయి. "కిరణ్... ఇలారా" ఎంతో ఉత్సాహంగా పిలిచింది శాంతిశ్రీ.

"నువ్వు కూడా" సరితవైపు చూసింది శాంతిశ్రీ.

"ఈ కవరు, సరితా నీ దగ్గరుంచు...అందులో వున్నవన్నీ అక్షరాల అమలుపరచాలి.... నేనెక్కడికో వెళ్ళిపోతున్నాననుకుంటున్నారా... ఇక్కడే వుంటున్నా" శాంతిశ్రీ వంశీని ఒళ్ళో కూచోపెట్టుకుంది. వెనకింట్లో వున్న పదేళ్ళ పిల్లని పక్కన కూచోపెట్టుకుంది, ఆమె ముఖం ఆనందంతో నిండిపోయింది.

"సరితా, ఈ కవరు నేను మరణించేవరకు విప్పద్దు అనుకుంటున్నావా... కాదు, ఎల్లుండి నా పుట్టినరోజు-అప్పుడు తెరవాలి" శాంతిశ్రీ మాటల్లో మర్మమేమిటో తెలియక చిరాగ్గా ముఖంపెట్టి లోపలికికెళ్ళిపోయింది విసుగ్గా.

'ఆ, ఏముంటుందీ, ఈ ఆస్తంతా ఏ అనాథ శరణాలయానికో రాసివుంటుంది' అనుకుంటూ ఆ కవరు విసురుగా పరుపు కింద పడేసింది సరిత.

అనుకున్న ఎల్లుండి రానే వచ్చింది.

సరిత మనసు పరిపరి విధాల పోతోంది.

అత్తగారిని అనాధాశ్రమంలో వుంచాలనే ఆలోచన తనకి రాకపోతే, ఈ ఇల్లు వాకిళ్ళు, అన్నీ తమకే దక్కేవిగా! ముసలాళ్ళు అందరికీ బోర్ అని, విసుగు అని, పైగా వాళ్ళు పిల్లల్ని గారాబం చేసి పాడుచేస్తారని, కాలో చెయ్యో వంగితే చచ్చేవరకు సేవ చేయాల్సిస్తుందని-ఇలాంటి వెన్నో పెట్టుకుని ఈ ఆలోచన చేసింది తనే!

ఏం,

వృద్ధాప్యం తనకు రాదా- తన కొడుకు...అమ్మో ఆ భావమే భయాన్ని కలిగించింది సరితకు. అయినా సరితకి విపరీతపు తెలివి ఎక్కువ- వెంటనే మనసుని సర్దిచెప్పుకుంది.

తనేదో పొరపాటు చేశాననుకుంటోంది కానీ, తన అత్తగారు ఏ ఆప్యాయతలు. ప్రేమలు, బంధాలు లేకుండా ఆస్తి ఎవరికో రాసే వుంటుంది. ఖచ్చితంగా ఎవరికో రాసే వుంటుంది-లేకపోతే, తను చచ్చాక కాదట, బతికుండగానే ఈ కవరు తెరిచి చూడాలా-ఎంత అహం!!! సరిత చేతిలో కవరు కదులుతోంది.

"ఆంటీ, ఈ రోజు మీ పుట్టినరోజు కదా- అమ్మ ఇమ్మంది" అంటూ పాయసం గిన్నె శాంతిశ్రీ ఇచ్చి పాదాలకు నమస్కరించింది పదేళ్ళ పిల్ల రాధమ్మ.

కవరు విప్పింది చాలా కసిగా సరిత. కవరులో వున్న కాగితం బయటికి తీసింది. "ఊ....చదువు" అన్నాడు కిరణ్.

"ఆడదానికి ఆర్థిక స్థితి బాగుండాలి-రేపేమిటో నీకు తెలియదు కదూ- పైగా చదువూ ఉద్యోగం లేనిదానివి. ఎలా బతుకుతావో అని నాకు బెంగ. అదే నా బాధ....నువ్వు ఏ భయాలూ లేకుండా జీవించాలని నా ఉద్దేశం. అందుకే ఇలా రాశాను. మీకు పిల్లలున్నారుగా...." సరిత కళ్ళను నమ్మలేకపోతోంది. మళ్ళీ మళ్ళీ చదివింది.

ఆస్తిలో సగభాగం తనకా- కొడుకుతో సమంగా కోడలికి ఆస్తి ఇవ్వడమా! సరిత కన్నీళ్ళు చెక్కిళ్ళనుంచి జారిపోతున్నాయి.

కాగితంలో చివరి పేరా మళ్ళీ చదివింది సరిత. ఆ డబ్బులో కొంత రాధమ్మ పెళ్ళికి. కొంత వంశీ చదువుకి. వెనుక ఔట్‌హౌస్ ఎప్పటికీ తాతకే!

ఆ కాగితం చేతిలో కదులుతుంటే. సరిత భర్త ముఖం చూడలేక తలదించుకుంది.

రోజులాగే తెల్లవారింది. శాంతిశ్రీ కాఫీ కప్పు అందించింది సరిత. "నానమ్మా, ఇక్కడే కూచో, నేను హోం వర్కు చేసుకుంటా" అంటూ నానమ్మ చెయ్యి పట్టుకులాక్కొచ్చాడు వంశీ.

"నానమ్మ, నేనూ ఇక్కడే చదువుకుంటా" రాధమ్మ వచ్చి వంశీ పక్కనే కూచుంది.

మనుమలిద్దరినీ దగ్గర కూచోపెట్టుకున్న శాంతిశ్రీ 'ఈ ఆనందం నేను ఎందుకు పోగొట్టుకోవాలి' అనుకుంది మనసులో.

రోజూలాగే కిటికీలోంచి పడుతున్న సూర్యకిరణాలు ఈ రోజు మరీ అందంగా, మరీ రంగురంగులుగా కనిపించాయి శాంతిశ్రీకి, సరితకి కూడా!!!

– ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 13 మార్చి 1998